క్లుప్తంగా

క్రమశిక్షణతో నడవాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో నడవాలని చెమ్మి యాపేట గంగాభవాని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మేరీ అన్నారు. సోమవారం కడపలోని సీఎస్ఐ స్కూల్‌లో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా రాయల్ రషీద్ అసోసియేషన్ వారు ట్రాఫిక్ రూల్స్ గురించి ముద్రించిన కరపత్రాలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా వాటిని విద్యార్థినీ విద్యార్థులకు అందచేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, సీఎస్ఐ హై స్కూల్ హెచ్ఎం దేవ సహాయం, ఆలం ఖాన్ పల్లె జిల్లా పరిషత్ స్కూల్ హెచ్ఎం మునిరత్నమ్మ, ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరాలి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో అత్యున్నత స్థాయికి ఎదగాలని మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని నాగరాజుపేటలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ - 100, రహదారి భద్రత, సోషల్ మీడియా - సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వైవీయూలో సర్టిఫికెట్ కోర్సులు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం (సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్) ద్వారా కూచిపూడి, భరతనాట్యం కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తాపద్మ , ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌బాబు ధర్మవరం కూచిపూడి కళా కేంద్రం కార్యదర్శి కె.ఎల్. కళ్యాణ్ చక్రవర్తి, అధ్యక్షులు కె. మంజుల, గౌరవ సలహాదారు నటరాజ కృష్ణమూర్తి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా ఏడాది వ్యవధిగల సర్టిఫికెట్ కోర్సులు దూర విద్య ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు.

ఇంటింటా న్యాయ ప్రచారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ జి.శ్రీదేవి, సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ సూచనల మేరకు సిబ్బంది సోమవారం ఇంటింటా న్యాయ ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా 46 టీములుగా ఏర్పాటై 4586 గృహాలను సందర్శించి 80 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించారు. కడప ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలలోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి నివారణ కోసం ఈనెల 10నుంచి 24వ తేది వరకు ఇంటింటి న్యాయ ప్రచారం నిర్వహించనున్నారు. ఒక్కొక్క టీములో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్, ఒక ఏఎన్ఎం, ఒక ఆశా, అంగన్వాడీ వర్కర్, ఒక వైద్యాధికారి, భవిత కేంద్రం నిర్వాహకులు పాల్గొంటున్నారు.

ఇసుక రీచ్ ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వీఎస్‌పల్లె మండలంలోని తంగేడుపల్లెలో సోమవారం నుంచి ఇసుక రీచ్‌ను నిర్వహణలోకి తీసుకు రావడం జరిగిందని జిల్లా మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. తంగేడుపల్లె ఇసుక రీచ్ ద్వారా అన్నిరకాల నిర్వహణ ఛార్జీలతో కలుపుకుని టన్ను ఇసుక ధర రూ. 51గా నిర్ణయించడం జరిగిందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమెరికా తీరుపై నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అమెరికా నుంచి వందలాదిమంది భారతీయులని బహిష్కరించి వారిని యుద్ధ విమానాల్లో తీసుకురావడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ అన్నారు. సోమవారం భారతీయుల పట్ల అమెరికా దుశ్చర్యకు నిరసిస్తూ నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, నగర నాయకులు నిర్మల్ రాజేష్ రవీంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ పాల్గొన్నారు.

సమాధుల స్థలం కోసం వినతి

కడప కార్పొరేషన్ : నగర శివార్లలో ఉన్న రామాంజనేయపురం పరిధిలో క్రైస్తవుల సమాధులకు స్థలం కేటాయించాలని పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఎం. వర ప్రసాద్, ది నేషనల్ కంజూమర్ రైట్స్ కమిషన్ స్టేట్ కో ఆర్డినేటర్ ఎం సురేష్ బాబు కోరారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబులకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా స్థలం ఏర్పాటు కోసం అనేక సార్లు అధికారులను కలిసి విన్నవించామన్నారు. కానీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లూరి జోజప్ప, స్థానిక క్రైస్తవులు ఎన్ బాల స్వామి, కిష్టఫర్, ఎస్ విలియమ్, కె.పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి


కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప అర్బన్ : ఆప్కాస్ రద్దు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ సోమవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఓపీ విభాగం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆప్కాస్ వ్యవస్థను తీసివేసి గతంలో మాదిరిగానే థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని ఈనెల 6వ తేదీన క్యాబినెట్ సమావేశంలో చర్చించినట్లు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. ఇలా చేయడం వలన పేదలను, పేదకార్మికులను మరింత పేదలుగా మార్చడమే ఈ ప్రభుత్వ ఉద్దేశ్యమా అని వారు విమర్శించారు. ఆప్కాస్ విధానం ఉండడం వలన కార్మికులకు నెలనెలా ఖచ్చితంగా వేతనాలు వస్తున్నాయన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు జరుగుతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు అనే అంశాన్ని పక్కనపెట్టి ఆప్కాస్‌లో వుండే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతున్నామన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రిమ్స్ ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోశాధికారి బాలాజీరావు, ఉపాధ్యక్షులు భాస్కర్, రామకృష్ణ, ఏసన్న, సువర్ధన్, కార్యదర్శులు కొండయ్య, చెన్నయ్య, సురేష్ ల్యాబ్ కమిటీ సభ్యులు జయరాం, కన్నయ్య, జయసుధ, మరియమ్మ, గాంధీనాయక్, శ్రీనివాసులు, సుబ్బారావు, పవన్, కార్మికులు జయకాంత్, ప్రసాద్, బి. నాగేంద్ర, డి.వి.రమణ, సుబ్బరాయుడు, నరసయ్య, ఆప్కాస్ కార్మికులందరూ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసే పక్షంలో కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు ఆనంద రావు, బ్రహ్మానంద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి, ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ నాయకులు సుంకర కిరణ్, పర్మినెంట్ యూనియన్ నాయకులు కొండయ్య, సోమిరెడ్డి, రాంమోహన్ రెడ్డి, నారాయణ, శ్యాం హరి. హనుమంతురెడ్డి, రామాంజనేయులు, అంజి, రాజా, గోపాల్, పాలకొండరాయుడు, అరుణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి


జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : చింతకొమ్మదిన్నె మండలం కేఎస్ఆర్ఎం కళాశాల వద్దగల నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మదన్‌మోహన్ రెడ్డి అనే విద్యార్థి అనుమానాస్పద మృతి విషయంగా పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు అజయ్, నగర అధ్యక్షులు జాలా సుమంత్, నగర ఉపాధ్యక్షులు వంశి, నగర నాయకులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి మృతికి కారణమైన నారాయణ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్, లింగమయ్యలు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

అధికారులు చర్యలు చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై విద్యాశాఖ అధికారులు మొద్దునిద్ర వీడి తగిన చర్యలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ హెచ్చరించారు. సోమవారం కడపలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న వారు పూర్తి స్థాయిలో డిప్రెషన్‌కు లోనవుతున్నారన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్ : నారాయణ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మదన్ మోహన్ రెడ్డి అనుమానాస్పద మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కడప ఓం శాంతి నగర్ లోని ఏ.ఐ.ఎస్.బి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు ప్రణయ్ కుమార్, సుమంత్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్ డే

వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్ దినోత్సవం ఉండాలని యోగివేమన విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలోని డీన్‌లు, అన్ని శాఖల విభాగాధిపతులతో సైన్స్ దినోత్సవ నిర్వహణపై సోమవారం ఉపకులపతి తన చాంబర్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 28వ తేదీన సైన్స్ డే నిర్వహణపై అభిప్రాయాలను స్వీకరించారు. దేశంలో ప్రఖ్యాతిగాంచిన సైన్స్ పరిశోధకులను ఆహ్వానించి సైంటిఫిక్ టెంపర్‌పై ఉపన్యాసం ఇవ్వాలని నిర్ణయించారు. అలానే విద్యార్థుల్లో, పరిశోధకులలో లోతైన పరిశోధనా అవగాహన కోసం పోస్టర్ ప్రజెంటేషన్ చేయనున్నారు. ఇందులో అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథరెడ్డి, కుల సచివులు ఆచార్య పి. పద్మ, డీన్ లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య కె. గంగయ్య, అన్ని శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్ కీ ఆవాజ్ సంస్థ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఉన్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఆప్ కీ ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆప్ కి ఆవాజ్ జిల్లా అధ్యక్షులు షాజహాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాన్ బాష, కార్యదర్శులు సయ్యద్ మహబూబ్ సాహెబ్, సయ్యద్ మౌలాలు మాట్లాడుతూ ఇమామ్, మౌజన్‌లకు దాదాపు 11 నెలల నుండి ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉండగా, నేటి వరకు ఈ గౌరవ వేతనం పేరుతో ప్రకటనలే తప్ప ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లకు ప్రతి నెలా గౌరవ వేతనం కింద రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల చొప్పున కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం జీవోను విడుదల చేశారు తప్ప ఇచ్చిందేమీ లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా మసీదులలో ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం కేటాయించిన గౌరవ వేతనం వెంటనే చెల్లించే విధంగా చూడాలని ఆప్ కి ఆవాజ్ జిల్లా కమిటీ కోరుతోందన్నారు. అనంతరం వారు జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖుభకతుల్లా, మౌలానా కుదరతుల్లా, మైనుద్దీన్, మహమ్మద్ షేక్ షావలి, రమణ, రఫిక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బారి నుంచి అపురూప గ్రంథాలకు రక్షణ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయంలోని అపురూపమైన గ్రంథాలకు అగ్ని బారి నుంచి రక్షణ కల్పించాలని జిల్లా సహాయ విపత్తు నిర్వహణ శాఖ అధికారి బసివిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి అందులోని పుస్తకాలు, వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం వాటిని అగ్నిప్రమాదం నుంచి ఎలా రక్షించుకోవాలో సోదాహరణంగా వివరించారు. గ్రంథాలయంలో పుస్తకాలకు ప్రమాదం పొంచి ఉందన్న అంశాన్ని గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ తన దృష్టికి తెచ్చారని, గత మే నెలలో తాను సిబ్బందితోకలిసి గ్రంథాలయాన్ని తనిఖీ చేశామన్నారు. అగ్ని నిరోధక పరికరాలను పరిశీలించి లోటుపాట్లు, తీసుకోవాల్సిన చర్యల గురించి నాటి వీసీకి లిఖిత పూర్వకంగా తెలిపామని, ఇంతవరకు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి పరికరాల వినియోగం, వాడకం గురించి సిబ్బందితోపాటు పాఠకులకు కూడా తెలిపారు. విద్యుత్ మదర్‌బోర్డులు, స్విచ్ బోర్డులు, సెన్సార్లు మరమ్మత్తులు చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురిగోపాలకృష్ణ, హరిభూషణరావు, నీలకంఠ, రమణ; జానమద్ది విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర నామ పారాయణం


దేవతా మూర్తుల సన్నిధిలో గురువుల నామ పారాయణం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణమంతా విష్ణు సహస్ర నామ పారాయణంతో మారుమోగింది. ఆలయ వార్షిక, రజతోత్సవ వేడుకల సందర్భంగా చివరిరోజు సోమవారం ఉదయం నుంచి ఆలయప్రాంగణంలో అఖిల భారత విష్ణు సహస్ర నామ పారాయణ సమాఖ్య ఆధ్వర్యంలో సహస్ర నామ పారాయణ జపయజ్ఞం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి మార్గదర్శనంలో ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దాదాపు 100 మంది భక్తులు సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీ సీతారామ లక్ష్మణులు తదితర దేవతామూర్తులను కనుల పండువగా అలంకరించారు.

16న 'భూతపురి' పురస్కార ప్రదానోత్సవం

కడప కల్చరల్ : మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 16న భూతపురి సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ తెలిపారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భూతపురి 88వ జయంతి నాడు 23వ సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త పుత్తా పుల్లారెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథ కుమార్ సభాధ్యక్షులుగా, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు.

మూఢ నమ్మకాలను నిర్మూలించాలి

కడప ఎడ్యుకేషన్ : మూఢ నమ్మకాలను శాస్త్రీయ దృక్పథం ద్వారానే నిర్మూలించగలమని జేవీవీ నాయకులు పిళ్లా కుమారస్వామిరెడ్డి అన్నారు. సోమవారం కడప ఐటీఐ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన పైన ఉపన్యాసం, మ్యాజిక్ ప్రోగ్రాం, మ్యాజిక్ వెనక నున్న అనేక సైన్స్ సూత్రాలను వివరిస్తూ కళాశాల అధ్యాపకులు నారాయణరెడ్డి అధ్యక్షత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు, గ్రంథ రచయిత, కవి, పిళ్లా కుమారస్వామి రెడ్డి , జన విజ్ఞాన వేదిక నాయకులు బాల రంగయ్య, జనవిజ్ఞాన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు పలు అంశాలపై వివరించారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు శివరాం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగతనాలను అరికట్టేందుకు అవగాహన

కడప అర్బన్: జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కాలనీలు, గ్రామాలలో దొంగతనాలను అరికట్టేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి వెళ్లేటపుడు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడం వలన ఇంటిపై నిఘా ఉంచుతారన్నారు. బంగారు, వెండి తదితర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచుకోవడం వలన దొంగతనానికి ఆస్కారం ఉండదన్నారు. ఇతర ఊర్లకు వెళ్లేటపుడు పోలీసుశాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్‌హెచ్ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చోరీల నిరోధానికి వీలయిన వారు ఇంటివద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్ని ప్రాంతాలలో సీఐ ఓబులేసు, ఎస్ఐలు ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరి రావు, శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కడప జోన్ కార్యదర్శి ఎస్.పురుషోత్తంలు కోరారు. సోమవారం ఈ మేరకు వారు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ద్వారక తిరుమలరావును కలిసి సన్మానించడంతోపాటు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల కిశోర్ బాబు, బి.రాజేంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీలు మల్లికార్జున, పీజే కుమార్‌లు పాల్గొన్నారు.

13న బండలాగుడు పోటీలు

సిద్దవటం : భాకరాపేట సమీపంలో ఉన్న శివునిపల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన స్వామి 23వ ఆరాధన ఉత్సవాలలో బాగంగా ఈనెల 13వ తేదీ బండలాగుడు పోటీలు జరుపనున్నట్టు కమిటీ వారు తెలిపారు.

అతి వేగంగా వాహనాలను నడపరాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ద్విచక్ర వాహనాలు నడిపే వారు అతి వేగంతో నడిపి ప్రమాదాలకు గురి కాకూడదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో రాయల్ రషీద్ అసోసియేషన్ వారు ముద్రించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌస్ పీర్, మైనుద్దీన్, సంజయ్, కాంతమ్మ, హరిప్రసాద్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మా.. దీవించవమ్మా..


విద్యుద్దీప అలంకరణలో శ్రీ విజయదుర్గాదేవి ఆలయం

నేటి నుంచి విజయదుర్గాదేవి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆదివారం ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఉత్సవాల పూర్వంగ పూజలు నిర్వహించారు.

ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ప్రతి రోజూ విశేష అభిషేకాలు, చండీ హోమం, శ్రీచక్రార్చనలు నిర్వహిస్తారు. 14వ తేదీ శుక్రవారం మాఘ బహుళ విదియ నాడు శ్రీ విజయ దుర్గా దేవి అమ్మవారు కడపలో కొలువుదీరిన పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కళ్యాణం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 8 గంటల నుండి శ్రీ విజయ దుర్గాదేవి నగరోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో నింపారు. ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన విద్యుత్ దీప కటౌట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : శ్రీవేంకటరమణుడు ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీవేంకటరమణుడు పగలు హనుమద్వాహనం, రాత్రి గజ వాహనాలపై కొలువుతీరి భక్తులు దర్శనమిచ్చారు. భక్తులు గోవింద నామస్మరణలతో దేవదేవుని ఆరాధించారు. స్వామివారు తమ ఇంటి ముంగిటకు రాగానే గోవిందా అంటూ భక్తిపారవశ్యంతో పూజా ద్రవ్యాలు, కాయ కర్పూరాలు సమర్పించి వేడుకున్నారు. సాయంత్రం గజవాహనంపై పురవీధులలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణ పురవీధులైన పూలంగళ్ల సర్కిల్, మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు.

కల్యాణం కమనీయం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటరమణుడి కల్యాణం ఆలయ అర్చకులు వరదాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం నిర్వహించారు.

కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలి


దీక్ష చేపట్టిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో నిర్మించాల్సిన ఉక్కు పరిశ్రమ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని వీడాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్ రెడ్డి, జయవర్ధన్ తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం 48 గంటల దీక్ష చేపట్టారు. సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ దీక్షలో కూర్చున్న వారికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన చట్ట ప్రకారం కడప జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఉక్కు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం తగదన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే రాయలసీమ జిల్లాల్లోని వేల మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. అయితే పాలకులు కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం మాత్రమే శంకుస్థాపన వరకు పరిమితం అవుతూ నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన నిలబడి జిల్లాలో ఉక్కు పరిశ్రమ వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కో కన్వీనర్ హిమబిందు, జిల్లా కన్వీనర్ అరుణ కుమారి , యుగంధర్ రెడ్డి, వసంత్ , అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాయలసీమ కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ దీక్షకు ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కన్నేలూరు శంకర్, ఓరుగంటి నాగేంద్రబాబు, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, ఆప్ కీ ఆవాజ్ నాయకులు మగ్బూల్ తదితరులు పాల్గొని మద్దతు తెలియజేశారు.

బాలలను మరబొమ్మలుగా మార్చకండి

సినీ హాస్యనటుడు గౌతంరాజు



కడప కల్చరల్ : బాల్యం జీవితానికి అపురూపమైన వరమని, అంతటి గొప్ప వరాన్ని బాలలు సద్వినియోగం చేసుకునేలా పెద్దలు చూడాలని, అంతేగానీ వారిని మర బొమ్మలుగా మార్చవద్దని ప్రముఖ సినీ హాస్యనటులు గౌతంరాజు అన్నారు. ఆయన కడపకు విచ్చేసిన సందర్భంగా సోమవారం సాక్షితో మాట్లాడారు. జీవితం దైవం ఇచ్చే గొప్ప వరమని, అందులో బాల్యం మరింత మధురమైనదని ఆయన పేర్కొన్నారు. నేటి తరం బాలలు పెద్దల దారిలో మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని, పాఠశాలల్లో పాఠాలు, మిగతా సమయాల్లో ట్యూషన్లతోనే వారి బాల్యం గడిచిపోతోందన్నారు. రానురాను వారు మరబొమ్మల్లా మారిపోతున్నారని, నైతిక విలువలు తదితర స్పందనలు వారిలో కరువు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాఠశాల స్థాయిలో వారికి నైతిక విలువలు బోధించాలని సూచించారు. ప్రధానంగా ఆటపాటలతో బాల్యం గడిచేలా చర్యలు చేపట్టాలన్నారు. వారికి ఆసక్తిగల కళారంగాలలో శిక్షణ ఇప్పిస్తే వారు మంచి స్థాయికి వెళ్లి తల్లిదండ్రులు, పాఠశాల, గురువులతోపాటు ఆ ఊరికి మంచి పేరు ప్రఖ్యాతులు తేగలరన్నారు.

అభినందన


సుమియాను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కేడెట్స్

కడప ఎడ్యుకేషన్ : కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్‌సిసి ర్యాంకు హోల్డర్ అండర్ ఆఫీసర్ ఎస్. సుమియా ఢిల్లీలో రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపును పూర్తి చేసి వచ్చిన సందర్భంగా సోమవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సలీం బాష మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని ఎస్. సుమియా రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపులో పాల్గొని కళాశాల పేరును జాతీయస్థాయికి తీసుకెళ్లిందని ఆమెను అభినందించారు. ఎన్ సి సి ఆఫీసర్ బి. స్వరూప, స్టూడెంట్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. విజయలక్ష్మిదేవి, సుమియా తండ్రి రెహమాన్, డాక్టర్ షాజియా బేగం, డాక్టర్ గురు మోహన్ రెడ్డి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఖాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వల్లూరు : ప్రజలు అప్రమత్తంగా ఉంటే చైన్ స్నాచింగ్‌లు, గృహాలలో దొంగతనాలను నిరోధించడానికి అవకాశం వుంటుందని కమలాపురం సీఐ ఎస్కే రోషన్ అన్నారు. మండలంలో ఇటీవల చైన్ స్నాచింగ్ జరిగిన నేపథ్యంలో సోమవారం ఆటోలకు మైక్‌లను అమర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రాబోవు వేసవి కాలంలో ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తీసుకునే చర్యలు గురించి సూచనలు చేశారు. అనుమానిత వ్యక్తులు గ్రామాలకు వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బంగారు, వెండి తదితర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు.

ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పాపాఘ్ని నదీ తీరాన మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన శ్రీ రాజ్య లక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరి నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రారంభించారు. ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పారాయణాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలుగచేశాయి.